క్లుప్తంగా

వయోజనులకు రాతపరీక్ష



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో వయోజనులకు ఆదివారం రాతపరీక్ష నిర్వహించినట్లు ఏపీవో నాగేశ్వరరావు తెలిపారు. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు 530 మందికి డీఆర్డీఏ, వెలుగు గుంటూరు ఆదేశాలతో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామసమాఖ్య సహాయకులు, డ్వాక్రా సభ్యులతో చదువు చెప్పడం, లెక్కలు చేయడం వంటివాటితో వారిని అభ్యాసకులుగా తయారు చేసినట్లు చెప్పారు. అక్షరాస్యతను అంచనా వేసేందుకు వారికి ఆయాగ్రామాల్లోని ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో విడతలవారీగా పరీక్షలు నిర్వహించామన్నారు. పర్యవేక్షకుడిగా అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చలపతిరావు, మండల పర్యవేక్షకులు ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏపీవో నాగేశ్వరరావు, క్లస్టర్ పర్యవేక్షకులుగా వెలుగు సీసీలు షేక్. కరిముల్లా, సీహెచ్ ఆదిలక్ష్మి, జి. రమాదేవి, డి.ద్వారక, ఇన్విజిలేటర్లుగా అంగన్‌వాడీలు వ్యవహరించినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో పోలీసులు ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడిచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఖాజావలి మాట్లాడుతూ తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలో ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి తనిఖీ చేశామని, ఈ తనిఖీలో 10 మంది పేకాట రాయుళ్లతో పాటు 33,800 రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా



మంగళగిరి: నగర పరిధిలోని ఎర్రబాలెంలో ఆదివారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఎర్రబాలేనికి చెందిన నాయుడు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో అందించిన రంజాన్ తోఫాను టీడీపీ నాయకుడు ఆకుల ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు. 10 కేజీల బియ్యం, కేజీ గోధుమపిండి, లీటర్ ఆయిల్, కేజీ ఉల్లిపాయలతో పాటు 11 వస్తువులను 25 నిరుపేద కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



తాడేపల్లిరూరల్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తాడేపల్లి నులకపేటలోని పేద ముస్లింలకు రంజాన్ తోఫాను మంగళగిరి గుడ్ విల్ ముస్లిం సంక్షేమ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఇబ్రహీరం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విచ్చేసి రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీం ఆధ్వర్యంలో 11 సంవత్సరాల నుండి గుడ్‌విల్ ముస్లిం సంక్షేమ కమిటి తరుపున పేద ముస్లింకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ముస్లిం సోదరులందరు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అన్సారి, సయ్యద్ షాహినా, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్, టిడిపి మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవితానికి నడక అవసరం

తెనాలిఅర్బన్: ఆరోగ్యకరమైన జీవితానికి నడక ఎంతో అవసరమని వైద్యురాలు డాక్టర్ శారద పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 ఆధ్వర్యంలో శారద సర్వీస్ సొసైటీ సహకారంతో అమరావతి ఫ్లాట్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ వృద్ధాప్యంలో అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కొనేందుకు నడక ఎంతో దోహదపడుతుందన్నారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 అధ్యక్షుడు వేజండ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ క్లబ్ సభ్యులకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. సభ్యులు జి.మురహరిరావు, భుజంగరావు, సత్యనారాయణ రాజు, తుమ్మల సత్యనారాయణ, ఆర్.శివనాగేశ్వరరావు, అనురాధ, జ్యోతి, పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన అరటి ధర

- ఇతర రాష్ట్రాల నుంచి తగ్గిన దిగుమతి
- మార్కెట్‌లో కనిపించని అరటి గెలలు

తాడేపల్లి రూరల్ : పేద ప్రజలకు అందుబాటులో ఉండే పండు అరటి పండు. ఈ అరటి పండు రేటు నిత్యావసర వస్తువుల కన్నా ఎక్కువ అమ్మబలుకుతోంది. ఒక్కో అరటికాయ రూ.6-8లకు అమ్ముతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది మార్చి నెల వరకు డజను రూ. 40 కూడా అమ్మని అరటి పండు ఏకంగా రూ. 70-80కు చేరింది. ఎన్నడూ లేని విధంగా అరటి గెలల రేట్లు పెరిగాయని రిటైల్ వ్యాపారస్తులు అంటున్నారు.

తగ్గిన దిగుమతి..

మన రాష్ట్రానికి ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు నుంచి అరటి గెలలు దిగుమతి చేసుకుంటారు. అక్కడ టన్ను రూ. 20 వేలు కావడంతో హోల్‌సేల్ వ్యాపారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక టన్నుకు 45-50 గెలలు మాత్రమే ఉంటాయి. అక్కడే గెల రూ. 400 లకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అదీ కాక ఒక్కో గెలకు రూ. 50 రవాణా చార్జీలు అవుతున్నాయి. అంతేకాకుండా అక్కడ నుంచి వచ్చే అరటి గెలలు నాణ్యత లేకపోవడంతో వాటిని దిగుమతి చేసుకునేందుకు వ్యాపారస్తులు సంకోచిస్తున్నారు.

తగ్గిన పంట

మన రాష్ట్రంలో గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అరటి తోటలు విస్తారంగా ఉన్నాయి. అరటి పిలకలు వేసిన సమయంలో వరదలు రావడంతో అరటి పంట తక్కువగా రావడం, ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి తగ్గడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. మార్చి, ఏప్రియల్ నెలలు దాటితే రైతులకు దిట్టుబాటు ధర రాదని, వరదల అనంతరం ఎక్కువ మంది రైతులు అరటినే పండించారని, రెండు మూడు నెలలు రేటు ఇలాగే ఉంటుందని పలువురు వ్యాపారస్తులు తెలియజేస్తున్నారు.



మార్కెట్‌లోని అరటి గెలులు

పెరిగిన ధరలు



అరటి గెలల వ్యాపారం 20 ఏళ్ల నుంచి చేస్తున్నాను. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది చిన్న సైజు అరటి కాయలను డజను రూ. 70, 80లకు విక్రయిస్తున్నాను.

– నాగిరెడ్డి, అరటి కాయల వ్యాపారి

పెరిగిన ధరలు

గతంలో కర్పూర రకం అరటి గెల రూ. 200 ఉండగా, ఇప్పుడు రూ. 500 లకు చేరింది. పచ్చ అరటి టన్ను రూ. 4 వేలు కాగా, ఇప్పుడు రూ. 12 వేలు అయింది. చక్రకేళి గెల రూ. 250 ఉండగా, రూ 500 లకు చేరింది. అమృతపాణి రూ. 200 నుండి రూ. 400 కు చేరింది. వ్యాపారస్తుల నుండి రిటైల్ అమ్మకందారులు కొనుగోలు చేసి వాటిని మాగేసి అమ్మేటప్పటికి డజను రూ. 70 - రూ.80 ఉంది. అదే పెద్ద సైజు అయితే రూ. 100 - రూ. 120 లకు వ్యాపారస్తులు అమ్ముతున్నారు. దీంతో సామాన్య ప్రజలకు అరటి పండు తినే యోగ్యానికి దూరమవుతున్నారు.

నేర ప్రవృత్తిని వీడి..సత్ప్రవర్తనతో మెలగాలి

మంగళగిరి: రౌడీషీటర్లు నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసు అధికారులు సూచించారు. ఆదివారం మంగళగిరి రూరల్ , పట్టణ స్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు భూదందాలు, సెటిల్మెంట్లు, గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లు గ్రామాలలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, భూదందాలు, సెటిల్మెంట్‌లకు దిగితే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా పేకాట, కోడిపందాలు నిర్వహించడం లాంటివి చేస్తే వెంటనే అరెస్ట్ చేయడంతో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు మారి సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కౌన్సిలింగ్‌లో రూరల్ , పట్టణ సిఐలు వై శ్రీనివాసరావు, డి వినోద్‌కుమార్, సీహెచ్ వెంకట్ పాల్గొన్నారు.



రూరల్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ తదితరులు

గృహ నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సొంత స్థలం కలిగి ఉండి, గృహం నిర్మాణం చేసుకొనుటకు సిద్ధంగా ఉన్న అర్హత కలిగిన కుటుంబాల వారు 4బీ అప్లికేషన్ ఫాంను గ్రామ, వార్డు సచివాలయాల కార్యాలయాల్లో ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అర్జీదారులు, వారి భర్తతో కలసి ఉన్న ఫొటోను విధిగా అర్జీకి అతికించాలని, ఆదాయ ధృవీరణ పత్రం రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, హౌస్ ట్యాక్స్ బిల్లు, ఓటరు ఐడి కార్డు, కుటుంబ సభ్యులు అందరి ఆధార్ కార్డుల నకళ్లు, కుల ధృవీకరణ పత్రం, వ్యక్తిగత బ్యాంకు ఖాతా మొదటి పేజీ, ఇంటి పట్టా లేదా సొంత ఇంటి స్థలం డాక్యుమెంట్లు, అంగ వైకల్యము ఉంటే సంబంధిత సర్టిఫికేట్ మొదలైన జెరాక్స్ కాపీలను అప్లికేషన్‌కు జతచేయాలని, ముఖ్యంగా ఓటిపి కొరకు ఆధార్‌కార్డును అనుసంధానమైన ఫోన్ నంబరు కలిగి ఉండాలని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రజక కల్యాణ మండపం ప్రారంభం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో నిర్మించిన చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, గుంటూరు జిల్లా బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ అధికారిణి సుమిత్రాదేవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపం పేద, మధ్యతరగతి బలహీనవర్గాలకు విద్య, విజ్ఞాన, సాంస్కృతిక కేంద్రంగా భవిష్యత్తు తరాలకు ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘం నాయకులు చేసిన కృషి ఫలితమని, నిర్మాణానికి విరాళాలు ఇచ్చి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల రాము, వల్లభాపురం శంకర్‌లు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ కల్యాణ మండపం నిర్మాణంలో పూర్తి సహాయ సహకారాలు అందించారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, అమరావతి రాజధాని ప్రాంత రైతు నాయకులు కళ్ళం రాజశేఖరరెడ్డి, నాయకులు నూతక్కి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మండపాన్ని ప్రారంభిస్తున్న భాస్కరయ్య, సుమిత్రాదేవి

కూటమి కలిసుండాలని కోరుకోండి

హైలెవెల్ వంతెన శంకుస్థాపనలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కొల్లిపర(తెనాలి): కూటమి కలిసుండాలని ప్రజలు కోరుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమిలో అందరూ సమర్థవంతమైన నాయకులు ఉన్నారనీ, అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. కొల్లిపరలో రేపల్లె బ్యాంక్ కెనాల్‌పై రూ.4.19 కోట్ల అంచనాతో హైలెవెల్ వంతెన నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు జాబ్ కార్డులు తక్కువగా ఉండటంతో కేవలం రూ.2 కోట్లే మంజూరైనట్టు చెబుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను మంత్రి మనోహర్‌ను కలిసి చేసిన విజ్ఞప్తితో రూ.10 కోట్లు విడుదలైనట్టు చెప్పారు. కేంద్రం నుంచి రూ.20 కోట్ల అంచనాలతో మూడు రోడ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చినట్టు చెప్పారు. మొత్తంమీద తెనాలికి రూ.37 కోట్లు తీసుకురావటం జరిగిందన్నారు. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న వంతెన రైతాంగానికి, ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. డొంకరోడ్ల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి రూ.10 కోట్లు విడుదల చేశారని చెబుతూ వీటితో వేసవిలో మండలంలోని డొంక రోడ్లన్నీ పూర్తిచేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు హైలెవెల్ వంతెన అనుసంధానం కాగలదని చెప్పారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన పెమ్మసాని, ఆలపాటి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొల్లిపర: గ్రామాల్లో వివిధ ఫౌండేషన్, వైద్యశాలలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కొల్లిపర గ్రామంలోని పాలకేంద్రం కల్యాణ మండపంలో ఫీనిక్స్ ఫౌండేషన్ మరియు శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఆదివారం మండలంలోని 20 గ్రామ ప్రజలకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్ పాల్గొన్ని జ్యోతి ప్రజ్వల చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ వైద్య శిబిరానికి 20 గ్రామాల నుంచి 306 మంది వచ్చి పరీక్షలు చేయించుకున్నారన్నారు. తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎంపీడీవో వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

30న జైభీమ్ చాంపియన్స్ ట్రోఫీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ఈ నెల 30 నుంచి జై భీమ్ చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించనున్నట్లు జైభీమ్ యూత్ (గొల్లపాలెం) ఆర్గనైజర్ స్వర్ణ రైస్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు, చతుర్ధ బహుమతిగా రూ.పదివేల నగదు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, డ్రస్ కోడ్ పాటించాలని చెప్పారు. వివరాలకు 7799 820420 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

చినకాకానిలో వైఎస్సార్ సీపీ సమావేశం

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ బీసీ, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు తాడిబోయిన సుబ్బారావు, కట్టిపోగు భూషణం, రామకృష్ణారెడ్డి, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు వాహనాలు ప్రారంభం

తెనాలిఅర్బన్: 15వ ఆర్థిక సంఘం నిధులతో తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ, మూడు కాంపాక్టర్లను సోమవారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులో యడ్లపాటి వెంకట్రావు ముఖద్వారం పునర్నిర్మాణం కార్యక్రమంలో కూడా వారు పాల్గొంటారని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చాలెంజింగ్ కాంపిటీషన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. శివాజీచౌక్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

అనాథ మృతులకు కాశీలో పిండ ప్రదానం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మృతి చెందిన అనాథలకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించడంతో పాటు ఆదివారం కాశీలో పిండ ప్రదానం చేశారు. వివరాలోకి వెళితే శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏడు సంవత్సరాల నుంచి అనాథ మృతులకు అంత్యక్రియలు నిర్వహిస్తూ వచ్చారు. మృతుల అస్థికలను హిందూ సంప్రదాయ పద్ధతిలో కాశీ పుణ్య క్షేత్రంలోని మణికర్ణిక ఘాట్ వద్ద ఆదివారం సమితి ఆధ్వర్యంలో పిండప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుర్రా శ్రీను మాట్లాడుతూ హిందూ సంప్రదాయ ప్రకారం ఎవరైనా వ్యక్తి చనిపోతే అస్థికలను నిమజ్జనం చేసి పిండ ప్రదానం చేస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని తెలిపారు. గంగానదిలో అస్థికలను నిమజ్జనం చేసి పిండ ప్రదానం చేసినట్లు చెప్పారు. సేవా సమితి సభ్యులు ఎ.శివప్రసాద్, ఎస్.రాంబాబు, ఎం.తేజబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ రౌడీషీటర్..చేసేది సెటిల్‌మెంట్స్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల రౌడీ షీట్ తీయించుకున్న ఓ వ్యక్తి కిందిస్థాయి పోలీసులను తన బుట్టలో వేసుకుని చక్రం తిప్పుతూ తనదైన శైలిలో సెటిల్‌మెంట్ చేస్తూ అందినకాడికి జేబులు నింపుకుంటూ పబ్బం గడుపుతున్నాడు. నవంబర్‌లో నవులూరుకు చెందిన ఎ1 రౌడీషీటర్ తన రౌడీషీట్‌ను కోర్టు ద్వారా తీయించుకున్నాడు. అనంతరం యస్‌ఐ స్థాయి కింద సిబ్బందితో మందు, ఇతర పార్టీలు ముందుగా అందజేసి తరువాత ఆ మాజీ రౌడీషీటర్ వారిని చెప్పుచేతల్లో పెట్టుకుని మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్లకు తెరలేపాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఎస్‌ఐలు, ఇతర ఉన్నతాధికారులు మాజీ రౌడీషీటర్ నీకు ఇక్కడ ఏం పని అని అడుగుతారనే భయంతో సదరు కానిస్టేబుల్‌ను ఎకో పార్కుకు పిలిపించి అక్కడే సెటిల్ చేసి ఎవరికి ఇవ్వాల్సిన డబ్బులు వారి అందజేసి సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఓ కుటుంబ ఆస్తి విషయంలో తలదూర్చి అవతలి వారిని బెదిరించడంతో రూరల్ ఎస్‌ఐ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. అప్పటి నుండి పోలీస్‌స్టేషన్ బయట ఉండి సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు సమాచారం. పోలీస్ ఉన్నతాధికారులు సదరు మాజీ రౌడీషీటర్‌పై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

ప్రలోభపెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: ప్రజలను ప్రలోభపెట్టడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అలాంటి వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. నగర పరిధిలోని నిడమర్రు గ్రామం వైఎస్సార్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ మోసపు హామీలు ఇచ్చి చంద్రబాబు ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలలో ఓడిపోలేదని , చంద్రబాబు మోసపు హామీలు ఓడించాయన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ప్రజలకు చేసేది మాత్రమే చెబుతాము, చేయలని అబద్ధపు హామీలు ఇవ్వలేమన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని ఏ ఒక్క కార్యకర్తకు కష్టం, నష్టం వచ్చినా తాను పార్టీ అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టిపోగు భూషణం, సీనియర్ గ్రామ పార్టీ నాయకులు గాదె సుబ్బారెడ్డి, జంగా నాగిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

ప్రజా చైతన్య యాత్రలో సమస్యల వెల్లువ

మంగళగిరి: ప్రజా చైతన్య యాత్రలో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తుతున్నాయని సీపీఎం నాయకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని కొప్పురావుకాలనీ, ఆంజనేయకాలనీలలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయ కాలనీలోని మహిళ కరెంట్ బిల్లు చూపించి తాము గత నెల అంతా ఇంట్లో లేమని ఊరికి వెళ్లామని అయినా కరెంట్ ఎప్పటిలాగే వచ్చిందని తెలిపింది. బిల్లులో వాడకం రూ.24 కాగా ట్రూ అప్ ఛార్జీలు ఇతర ఛార్జీలతో కలిపి రూ.199గా బిల్లు వచ్చింది. 70 సంవత్సారాల వృద్ధుడు తనకు వేలి ముద్రలు పడడం లేదని పెన్షన్ రావడం లేదని తెలిపారన్నారు. ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం వుందన్నారు. ప్రజా వ్యతిరేక పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాశం రామారావు, జీవి రాఘవులు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య, వీసం జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ కాలనీలో చైతన్య యాత్రలో సీపీఎం నాయకులు

విప్లవ యోధుడు భగత్‌సింగ్

తాడేపల్లిరూరల్ : క్షమాభిక్షకు అవకాశం ఉన్నా ఉరి కొయ్యను ముద్దాడిన విప్లవ యోధుడు భగత్ సింగ్ అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతు నా రక్తం వృధా కాదని, నా నెత్తురు కోనేరులో నవలోకం వికసిస్తుందని భగత్‌సింగ్ అన్న మాటలు స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమ నాయకత్వం రాజీ ధోరణిలో వున్న సమయంలోనే రష్యాలో లెనిన్ సారథ్యంలో సోషలిస్ట్ విప్లవం విజయవంతమైందని, ఆ ప్రభావం భారత దేశంపై కూడా పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ట్రెజరర్ వి. సావిత్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పోరాట స్ఫూర్తి భగత్ సింగ్

మంగళగిరి: నిరంతర పోరాట స్ఫూర్తి భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురువులని డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు.ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని గాలిగోపురం వద్ద కల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే దేశం కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై తిరుగుబాటు చేసి ప్రాణాలర్పించిన త్యాగధనులు భగత్ సింగ్ అన్నారు. అమరవీరులైన వారు తుది శ్వాస వరకు భారత సమాజంలో పెరుగుతున్న మతతత్వ సమాజాన్ని విమర్శించారన్నారు. వారి స్ఫూర్తితో యువత నేడు కేంద్రంలోని మోది ప్రభుత్వ ఉన్మాద చర్యలను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్, ఎం నాగేశ్వరరావు, ఎం బాలాజీ, జేవి రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పారావు

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి

దుగ్గిరాల: మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్, సుకుదేవ్, రాజ్ గురుల వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు పాల్గొని, భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి, నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. సమాజంలోని అందరికి విద్య, ఉద్యోగం, కూడు గూడు అందాలని కోరుకున్న మహోన్నతుడు అని గుర్తు చేశారు. సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాల రాజు, వై.స్టాలిన్, శ్రీనివాస రావు, చిరంజీవి, అమ్మిరెడ్డి, కార్తీక్, మహేష్ పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో మురుగు సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎంపీ పి. మధు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లిలోని ఆశ్రమం రోడ్‌లో మురుగునీటి సమస్యపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నగరాలకంటే నాలుగు రెట్లు పన్నులు అదనంగా వసూలు చేస్తున్న తాడేపల్లిలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. అపార్ట్‌మెంట్ల నుండి మురుగు బయటకు పోవడానికి దారి లేకపోవడం దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో ప్రజలు పలు అనారోగ్యాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు నేటికీ అమలు కావడం లేదని విమర్శించారు. రాష్ట్ర పట్టణ పౌర సంక్షేమ సమాఖ్య కన్వీనర్ సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో ఇప్పటికే పెద్ద పెద్ద బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం అయ్యాయని, రాబోయే రోజుల్లో మరిన్ని నిర్మాణాలతో పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్‌లు రానున్నాయని, ప్రభుత్వం, అధికారులు సరైన చర్యలు తీసుకోకపోతే మోడరన్ స్లమ ఏరియాగా మారుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఐకాన్ అధ్యక్షులు వినోద్‌కుమార్, పలు అపార్ట్‌మెంట్‌ల నివాసులు అడుసుమిల్లి సత్యానారాయణ, పిన్నమనేని మురళీకృష్ణ, విజయ్ కుమార్, సిహెచ్ శివరామిరెడ్డి, కె. లక్ష్మయ్య, రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధు

విద్యాదాత బెంజిమెన్ సేవలు చిరస్మరణీయం

తెనాలిటౌన్: ఎందరో పేద విద్యార్థులకు విద్యనందించి వారి ఉన్నతికి పాటుపడిన పొన్నెకంటి బెంజిమెన్ సేవలు చిరస్మరణీయమని ఆది జాంబవా దళిత ఎంప్లాయీస్ సేవా సమితి సభ్యులు కొనియాడారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆదివారం బెంజిమెన్ వర్ధంతిని దళిత ఎంప్లాయీస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు సేవా సమితి కార్యదర్శి ఉన్నం యెహేజ్కేల్ అధ్యక్షత వహించారు. విశ్రాంత పోస్టల్ ఉద్యోగి సుద్దపల్లి శరత్ వెంకయ్య పాల్గొన్నారు.